# ఎప్పట్లాగే గ్రూప్-2 ఖాళీల భర్తీ!

- ఈసారికి అవకాశమివ్వాలని ప్రభుత్వానికి ఏపీపీఎస్సీ లేఖ
- ఆమోదం లాంఛనప్రాయమే!

ఈనాడు - హైదరాబాద్

ఉద్యోగార్థుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, పూర్వ విధానంలోనే గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ఈసారికి అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) కోరింది. దీనిపై సర్కారు సానుకూలంగా స్పందించనుందని తెలుస్తోంది. గ్రూప్-1ను గ్రూప్-1ఏ, 1బీలుగా విభజిస్తూ 2012 డిసెంబరు 13న కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం జీవో నం.622, 623లను ఇచ్చింది. నిరుద్యోగులు తీవ్రంగా వ్యతిరేకించడంతో వీటి అమలును ఏడాది వరకు నిలిపేస్తూ 2013 జులైలో ఉత్తర్వులు వెలువడ్డాయి. గ్రూప్-1, గ్రూప్-2, ఇతర ఉద్యోగాలు కలుపుకొని 4,009 ఖాళీలను ఏపీపీఎస్సీ ద్వారా భర్తీ చేయడానికి గత నెల్లో మంత్రివర్గం ఆమోదం తెలపడంతో 622, 623 జీవోల అమలుపై ఏపీపీఎస్సీ ప్రభుత్వాన్ని స్పష్టత కోరింది. ఈ జీవోలపై నిరుద్యోగులు మళ్లీ భగ్గుమన్నారు. ఇవి వెలువడ్డాక ఇప్పటివరకు ఉద్యోగ ఖాళీల భర్తీ ప్రకటనలు రాలేదని, పూర్వపద్ధతి ప్రకారమే తాము ఏళ్లుగా సన్నద్ధమవుతున్నామంటూ, వీటి అమలును నిలిపేయాలని డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీ కార్యాలయం వద్ద ఆందోళన కూడా చేపట్టారు. ఏపీలో అక్కడక్కడ ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ పరిస్థితులపై ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఉదయ్‌భాస్కర్, సభ్యులు సమావేశమై, తాజా నిర్ణయం తీసుకున్నారు. గ్రూప్-2లోని ఉద్యోగాలను గ్రూప్-1లో విలీనం చేయకుండా, ఎప్పట్లాగే బహుళైచ్ఛిక పద్ధతిలోనే గ్రూప్-2 పరీక్షలు నిర్వహించేందుకు అనుమతించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి గిరిధర్ 'ఈనాడు'కు తెలిపారు. ఈ అంశం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. సీఎం ఆమోదం లాంఛనప్రాయమేనని భావిస్తున్నారు.

## *2003 గ్రూప్-1 ప్రకటన కింద మరో 68 పోస్టుల భర్తీ!*

2003 గ్రూపు-1 ప్రకటనను అనుసరించి మరో 68 ఖాళీల భర్తీకి ఏపీపీఎస్సీ సిద్ధమవుతోంది. ' 'మెరిట్ జాబితా ప్రకటించాక అభ్యర్థులు రాకపోతే ప్రాధాన్యక్రమంలో తర్వాతి స్థానాల్లో ఉన్న వారికి అవకాశం కల్పించాలని రూల్-7 చెబుతోంది. దీనిని అప్పటి అధికారులు పాటించలేదు. దీనిపై న్యాయపోరాటం అనంతరం సుప్రీంకోర్టు జారీచేసిన ఆదేశాలను అనుసరించి 68 ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోబోతున్నాం. ఇందులో 56 వరకు ఎంపీడీవో ఉద్యోగాలు ఉన్నాయి. ఈ పోస్టులను ఇతర గ్రూపు-1 పోస్టుల్లో కలిపారా, లేదా అన్నదానిపై పరిశీలన జరుపుతున్నాం. 2003 ప్రకటన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వెలువడినందున రెండు రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది" అని ఏపీపీఎస్సీ ఛైర్మన్ తెలిపారు.